## క్లుప్తంగా

### గోనెగండ్లకు చేరిన విద్యా కానుక కిట్లు

**గోనెగండ్ల:** జగనన్న విద్యా కానుక కిట్లు శనివారం గోనెగండ్లకు చేరినట్లు ఎంఈఓ వినోద్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో 55 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 11,880 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు మంజూరైనట్లు వివరించారు. గోనెగండ్లకు వచ్చిన విద్యా కానుక కిట్లను స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలలో భద్రపరిచినట్లు చెప్పారు. జగనన్న విద్యా కానుకలో యూనిఫాం, స్కూల్ బ్యాగు, నోట్ పుస్తకాలు, షూస్, రెండు జతల సాక్సులు, బెల్ట్, డిక్షనరీ ఉంటాయని తెలిపారు. మొదటగా యూనిఫాంలు, నోట్ పుస్తకాలు, బుట్లు, సాక్సులు వచ్చాయని, వేసవి సెలవులు ముగిసిన అనంతరం బడులు తెరిచిన రోజునే కానుకలను విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. సీఆర్పీ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయాలతో విజ్ఞానం


మొలగవల్లి గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

**ఆలూరు రూరల్:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి విజ్ఞానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసిందని మొలగవల్లి గ్రంథాలయ అధికారి భాస్కర్ అన్నారు. శనివారం వేసవి విజ్ఞాన శిబిరం 6వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా విద్యార్థులకు కథలు వినిపించడం, పుస్తకాలు చదివించడం చిత్రలేఖనం వంటి అంశాలపై ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి తోడు రోజు గంటపాటు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**కృష్ణగిరి:** వాహనదారులందరూ విధిగా రహదారి నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కృష్ణగిరి నుంచి ఎరుకలచెర్వుకు వెళ్లే రహదారిలో శనివారం సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు, హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులు, పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తున్న డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రయాణంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ప్రమాదమన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన పలువురు వాహనదారుల నుంచి జరిమానా వసూలుచేశారు.

### కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**హొళగుంద:** పొరుగు రాష్ట్రం కర్ణాటకలో శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఆ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డీఎస్ బాషా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బస్టాండులో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బాషా మాట్లాడుతూ మతతత్వ పార్టీ బీజేపీని కర్ణాటక ప్రజలు తిరస్కరించారన్నారు. జీఎస్టీ పేరుతో దోపిడీ, గ్యాస్, పెట్రోల్, నిత్యవసర ధరలు పెంచి సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాల్లో ఇదే తీర్పు పునరావృతం అవుతుందని జోస్యం చెప్పారు.

### ఆంజనేయస్వామికి పూజలు


పూజలందుకుంటున్న ఆంజనేయ స్వామి

**హొళగుంద:** మండల కేంద్రానికి 5 కి.మీ దూరంలో తెల్లకొండ వద్ద వెలసిన అగ్రహార ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. భజన, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే శనివారం స్వామి వారం కావడంతో మొక్కుబడులున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయ ప్రదక్షిణ, అభిషేకాలు, మహామంగళ హారతి, అలంకారం, ఆకుల అర్చన, అభిషేకాలు తదితర పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**తుగ్గలి:** హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. పగిడిరాయిలో అభయాంజనేయ స్వామి తిరునాల సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు తిమ్మారెడ్డి, ప్రభాకర రెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామికి పూలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నారు. అదేవిధంగా తుగ్గలి సమీపంలోని కిష్టాపురం కొండలో ఆంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి.

# బాలల భవితకు బడిబాట

- బడి మానేసిన పిల్లలు వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు
- స్కూళ్లలో చేర్పించేలా చర్యలు
- నాడు–నేడుతో కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ బడులు
- మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలలు



ఆలూరులోని ప్రభుత్వ బాలుర పాఠశాల

**ఆలూరు రూరల్:** ప్రతి చిన్నారి చదువుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగా మనబడి నాడు–నేడు కార్యక్రమాన్ని రూపొందించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల వసతులు కల్పించారు. కార్పొరేట్ స్థాయిలో భవనాలు సమకూర్చి విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, బ్యాగ్‌లు, షూలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం సమకూరుస్తున్నారు. అలాగే అమఒడి పథకం ద్వారా ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం బోధిస్తున్నారు. ఇందులో భాగంగానే పాఠశాలల్లో చేరికలు పెంచుందుకు, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు, చదువుతూ మధ్యలో బడిమానేసిన పిల్లల వివరాలను సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆలూరు మండలంలో ఉన్న 17 గ్రామ సచివాలయాల ద్వారా 51 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ఉన్న 5–18 ఏళ్ల పిల్లల వివరాలు సేకరిస్తున్నారు.

**చిన్నారుల వివరాల సేకరణ**

పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓఎస్సీ (అవుట్ ఆఫ్ ది స్కూల్ స్టూడెంట్స్) సర్వే చేసి బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని సంకల్పించారు. బడికి వెళ్లని పిల్లలు, మధ్యలో మానేసిన వారు, పదో తరగతి ఫెయిలై ఇంట్లో ఉన్న పిల్లల వివరాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. పిల్లల పేరు, తల్లిదండ్రుల పేర్లు, వారి అడ్రస్ వంటి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ వివరాలన్నీ జిల్లా విద్యాశాఖ సర్వర్‌కు అనుసంధానం చేశారు. వీటి ద్వారా విద్యాశాఖ మండల ఎంఈఓకు వారి పరిధిలో ఉన్న బడికి వెళ్లని పిల్లల వివరాలు పంపించి వారిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. పదో తరగతి ఫెయిలై ఇంట్లో ఉన్న బాలికలు, బాలురకు ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి వారితో పరీక్ష రాయించనున్నారు. ఓఎస్సీ సర్వే దాదాపు పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నాం. బడి మానేసిన పిల్లలు, బడి ఈడు పిల్లల వివరాలు సేకరించి వారిని బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నాడు–నేడు ద్వారా అన్ని బడుల్లో మౌలిక వసతులు కల్పించాం. ఉచితంగా పుస్తకాలు, నోటు బుక్‌లు, స్కూల్ డ్రెస్, షూ వంటివి అందిస్తాం. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి. పదో తరగతి ఫెయిలై ఇంట్లో ఉన్న విద్యార్థులకు ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ ఇచ్చి సంప్లిమెంటరీలో పరీక్ష రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

– కోమలాదేవి, ఎంఈఓ, ఆలూరు


ఓఎస్సీ సర్వేలో భాగంగా వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

### ఆదర్శ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కృష్ణగిరి:** స్థానిక మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతికి సంబంధించి బీసీ, ఓసీ విద్యార్థులు 1.9.2011 నుంచి 31.08.2013 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2009 నుంచి 31.08.2013 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించి ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### నేడు బండలాగుడు పోటీలు

**మద్దికెర:** మండల పరిధిలోని యడవలి గ్రామం సమీపంలోని శ్రీరామకృష్ణాపురం దేవాలయంలో హనుమాన్ జయంతి, అవధూత పక్కీరప్ప స్వామి రథోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఉదయం 8 గంటలకు దేశం, కిలారి ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు యడవలి, ఎం.అగ్రహారం గ్రామస్తులు శనివారం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 99498 41374, 99496 17011 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# రాజీ మార్గంలో కేసుల పరిష్కారం



పత్తికొండ: కేసులను విచారిస్తున్న జడ్జి దివ్య, ఆలూరు: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న ఆలూరు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి రమణా రెడ్డి

**పత్తికొండటౌన్:** వివిధ కారణాలతో గొడవలు పడి కేసులు పెట్టుకుని పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ ఇబ్బందులు పడే కక్షిదారులు లోక్‌అదాలత్‌ను ఆశ్రయించి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య సూచించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో జడ్జి వి.దివ్య 1535 కేసులను పరిష్కరించారు. ఇందులో ఎస్‌టీసీ కేసులు–1490, క్రిమినల్ కేసులు–27, సివిల్ కేసులు–13, ఎంసీ కేసులు–4, డీవీసీ కేసు–1 ఉన్నట్లు కోర్టు క్లర్క్ రమాదేవి తెలిపారు. లోక్‌అదాలత్ సభ్యులు మహేశ్, నాగభూషణరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, రంగస్వామి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

**రాజీయే రాజమార్గం**

**ఆలూరు రూరల్:** రాజీయే రాజ మార్గమని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రమణా రెడ్డి అన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులు క్షణికావేశంలో తప్పులు చేసి కోర్టుల చుట్టూ తిరగవద్దన్నారు. చేసిన తప్పుకు జైలుకు వెళ్లి శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను తెలుసుకుని మెలగాలన్నారు. కష్టపడి పనిచేసి కుటుంబాన్ని పోషించుకోవాలని, పిల్లలని బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా మొత్తం 141 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఆలూరు బార్ అండ్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు లక్ష్మీకాంత్, విజయ్‌భాస్కర్ న్యాయవాదులు ప్రవీణ్, షేక్షావలి, రవికుమార్, హెచ్.కె రవి, రాజేష్ నాయుడు, వీరేష్, కోర్టు సిబ్బంది ఉన్నారు. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద ఎస్‌ఐలు డాక్టర్ నాయక్, వరప్రసాద్, మల్లికార్జున, విజయ్ కుమార్, శ్రీనివాసులు హాజరయ్యారు.

### లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం


ఎమ్మిగనూరులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి గురు అరవింద్

**ఎమ్మిగనూరు:** కేసుల పరిష్కారంలో రాజీమార్గమే ఉత్తమమైనదని ఎమ్మిగనూరు మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ గురు అరవింద్ పేర్కొన్నారు. శనివారం ఎమ్మిగనూరు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. మెజిస్ట్రేట్ మాట్లాడుతూ క్షణికావేశంలో విచక్షణ కోల్పోయి జరిగిన సంఘటనలో కక్షిదారులు పునరాలోచించి రాజీ పడటం మంచి పరిణామమని, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల సమస్యలు సాధ్యమైనంత వరకూ కాలయాపనకు తావులేకుండా పరిష్కరించుకోవడం సరైందేనన్నారు. లోక్ అదాలత్‌లో 1,113 కేసులు పరిష్కారమైనట్లు వివరించారు. అందులో రాజీ కేసులు– 44, ఎస్టీసీ కేసులు 890కి రూ.29,490, సీసీకేసులు 173కు రూ.58,400, యూనియన్ బ్యాంక్ కేసుకు రూ.25,621, ఐదు బీఎస్ఎన్ఎల్ కేసులకు రూ.6300 జరిమానా విధించారు. డీఎస్పీ సీతారామయ్య, సీఐ మధుసూదన్‌రావ్, ఏపీపీ గోపాల్‌కృష్ణ, బార్ అసోసియేషన్ న్యాయవాదులు జగన్నాథరెడ్డి, కంటెప్ప, శ్రీకాంత్, ఆనంద్, యేసుపు, క్రిష్టఫర్, రంగనాథ్, సురేష్, తిమ్మప్ప, రామమూర్తి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# రమణీయం.. రంగస్వామి రథోత్సవం


కాత్రికి గ్రామంలో రంగస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

**ఆలూరు రూరల్:** మండలంలోని కాత్రికి గ్రామంలో కొలువైన రంగస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. శనివారం ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి గంగ పూజ, మహామంగళ హారతి వంటి తదితర పూజలు నిర్వహించారు. కాత్రికి గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలైన మూసానహళ్లి, కమ్మరచేడు, నారాయణపురం, పెద్ద హోతూరు, మరకట్టు, మనేకుర్తి, ఆలూరు గ్రామాల ప్రజలు, భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి రంగనాథ స్వామి, వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం దేవతా మూర్తులకు పూజలు నిర్వహించి రథంపైకి చేర్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ రంగనాథ స్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచిపెట్టారు.

# కుంటలో పడి బాలుడి మృతి


మృతిచెందిన యల్లకృష్ణ

**వెల్దుర్తి(కృష్ణగిరి):** మండల పరిధిలోని రామళ్లకోట గ్రామం పుల్లగుమ్మిపేటలో నివాసముంటున్న పరశురాముడు, కళ్యాణి దంపతుల రెండో కుమారుడు యల్లకృష్ణ (7) శనివారం గ్రామ సమీపంలోని రేగులకుంటలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఈ బాలుడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే పిల్లలను ఇంటి వద్ద వదలి పొలానికి వెళ్లారు. బాలుడు యల్లకృష్ణ మధ్యాహ్నం సమయంలో పొలం వైపు వెళుతూ దారిలోని కుంటలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. గమనించిన స్థానికులు కుంటలో దూకి బయటకు తీసేలోపే మృతి చెందినట్లు వారు తెలిపారు. ఉదయం నవ్వుతూ వెళ్లిరండి అమ్మ, నాన్న అని చెప్పిన కుమారుడు ఇలా అకాల మరణం చెందడంతో ఆ తల్లిదండ్రులు రోధిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

# మరో 11 మంది ఆటోడ్రైవర్లపై కేసులు

**హొళగుంద:** మండలంలో రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తూ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న మరో 11 మంది ఆటోడ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. సదరు డ్రైవర్లు రోడ్లపై, గ్రామాలలో అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడుపుతున్నారని దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఆరుగురిపై కేసులు నమోదు చేయగా శనివారం హొళగుంద, సుళువాయి, కోగిలతోటకు చెందిన మరో 11 మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆటో డ్రైవర్లు రోడ్డు, రవాణా శాఖ నిబంధనలు పాటిస్తూ, అన్ని రికార్డులు సక్రమంగా కలిగి ఉండి వాహనాలను నడుపుకోవాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఘనంగా శిఖర కలశ ప్రతిష్ఠోత్సవాలు


స్వామివారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

**ఎమ్మిగనూరుటౌన్:** పట్టణంలోని 18వ వార్డులోని పాత ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి సుదర్శన శిఖర కలశ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం సుదర్శన కలశ శోభయాత్ర అనంతరం జరిగిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం సుదర్శన కలశ ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం చేపట్టనున్నారు. వార్డు కౌన్సిలర్ బోయ రంగమ్మ, నాయకులు సోమేష్, సుధాకర్‌రెడ్డి, లచ్చన్న, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### డెంగీ నివారణపై అవగాహన


నందవరంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

**నందవరం:** డెంగీ నివారణ చర్యల్లో భాగంగా స్థానిక ఎస్సీ కాలనీలో శనివారం వైద్యాధికారుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎమ్మిగనూరు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహులు, సీహెచ్ఓ బలరాం నేతృత్వంలో దోమలు, ల్యార్వా నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. డ్రైయినేజీలు, కాలువలు, నీటి కుంటలు, తొట్టెలలో యాంటీ లార్వా ద్రావణాన్ని పారిశుద్ధ్య కార్మికులతో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా దోమలను నివారించాలన్నారు. దోమల నివారణకు దోమ తెరలు వాడాలని, మురుగు కాలువలు, నీటి కుంటలు, నీటి తొట్టెలు, రబ్బర్ ట్యూబ్‌లు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి వారం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు ఉన్నారు.

# నడవలయ్య స్వామికి వెండి కవచం


వెండి కవచాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

**ఎమ్మిగనూరురూరల్:** మండల పరిధిలోని గుడేకల్ గ్రామ కొండపై వెలసిన నడవలయ్య స్వామికి భక్తుల సహకారంతో 22 కేజీల వెండి కవచం చేయించారు. శనివారం సాయంత్రం పట్టణంలో నాయకుడు వై.పురుషోత్తంగౌడ్ ఇంటి నుంచి వెండి కవచాన్ని ఊరేగింపుగా గుడేకల్‌కు తీసుకెళ్లారు. స్వామివారికి 22 కేజీల వెండి కవచం, 2 కేజీల వెండి బిందె, మూడున్నర తులాల బంగారు బిల్లను భక్తులు, గ్రామస్తుల సహకారంతో చేయించారు. ఊరేగింపులో డాక్టర్ నవీన్ కుమార్‌గౌడ్‌తో పాటు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


నడవలయ్య స్వామికి 22 కేజీల వెండితో చేయించిన కవచం

### సబ్సిడీ దాణా మంజూరు

**మద్దికెర:** రాష్ట్ర ప్రభుత్వం పశువుల కోసం సమీకృత దాణా మంజూరు చేసిందని. దాణా కావలసిన పాడిరైతులు తీసుకెళ్లవచ్చని పశు వైద్యాధికారి కృష్ణానాయక్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 200 కిలోల దాణా రూ.4వేలు అవుతుందని ప్రభుత్వ సబ్సిడీ రూ.2,700 పోనూ రైతు రూ.1300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాణా కావాల్సిన రైతులు స్థానిక పశు వైద్యశాలలో సంప్రదించాలన్నారు.

### జెడ్పీ నిధులు రూ.5 లక్షలు మంజూరు

**మద్దికెర:** మండల పరిధిలోని హంప గ్రామానికి రూ.5 లక్షలు జెడ్పీ నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ శనివారం తెలిపారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఈ నిధులతో ట్యాంకులు, పైపులైను ఏర్పాటుచేసి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపారు.

### రేపు బండలాగుడు పోటీలు

**తుగ్గలి:** హనుమ జయంతి సందర్భంగా సోమవారం పగిడిరాయిలో వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి రూ.25 వేలు, ఎంపీపీ ఆదెమ్మ రంగన్న రూ.20 వేలు, సర్పంచ్ సౌజన్య రూ.15 వేలు, కాయల రంగయ్య రూ.10 వేలు, ఇసురాళ్ల లాలుస్వామి రూ.7,016, వడ్ల ఆచారి రూ.5,016 నగదు బహుమతులు అందజేస్తారని వెల్లడించారు. వివరాలకు 83090 06866, 99633 18902 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### ఎల్లెల్సీ నీటిని సరఫరా చేయాలి

**హొళగుంద:** స్థానిక ఈబీసీ కాలనీకి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) నీటిని గాకుండా బోర్ల నుంచి వచ్చే ఉప్పు నీటి సరఫరా చేస్తున్నారని, దీని వల్ల చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నట్లు కాలనీవాసులు వజీర్, షఫి, రజాక్ తదితరులు వాపోయారు. గత్యంతరం లేక బోరు నీటినే తాగాల్సి వస్తోందని, దీని వల్ల అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఎస్ఎస్ ట్యాంకులో 6 నెలలకు సరిపడా నీరున్నా బోరు నీటిని ఎందుకు వదులుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎల్లెల్సీ నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలని కోరుతున్నారు.

# రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత

**కృష్ణగిరి:** ఉపాధి హామీ పథకం కింద అన్ని గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీఓ అబ్దుల్‌షుకూర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆలంకొండ, తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున్న ఉదయం తొందరగా వచ్చి పనులు చేసుకోవాలని సూచించారు. పండ్ల తోటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులు ముందుకొస్తే ప్రభుత్వం నుంచి రాయితీలు అందేలా చర్యలు తీసుకుంటామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు ఉపయోగపడే, నీటి నిల్వ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

### ముమ్మరంగా వరి కోతలు


జొహరాపురంలో వరి కోత కోస్తున్న యంత్రం

**నందవరం:** మండలంలోని నది తీర ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గత రెండు వారాల్లో జోరుగా వర్షాలు కురిశాయి. దీంతో వరి పైరు దెబ్బతింది. తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్ష సూచన లేకపోవడంతో నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఆధునిక యంత్రాలతో రైతులు వరి కోతలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడు రకానికి రూ.2,080, బి గ్రేడు రకానికి రూ.2,060 మద్దతు ధర ప్రకటించింది. మార్కెట్‌లో ధాన్యం ధర రూ.2,000 నుంచి రూ.2,200 పలుకుతుండడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# తహసీల్దార్ కార్యాలయానికి వాస్తు దోషం


హొళగుందలో తహసీల్దార్ కార్యాలయం ప్రధాన ద్వారానికి తాళం వేసిన దృశ్యం

**హొళగుంద:** వాస్తు బాగాలేదని మూడేళ్ల క్రితం హొళగుంద తహసీల్దార్ కార్యాలయ ప్రధాన ద్వారానికి వేసిన తాళం నేటికి తెరుచుకోలేదు. ఆ పక్కనే ఇదే మోడల్‌తో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం ప్రధాన ద్వారంతో పాటు మరో ద్వారాన్ని కూడా తెరిచి ఉంచుతున్నారు. రెండు కార్యాలయాలను బేరీజు వేసుకుంటున్న ప్రజలు తహసీల్దార్ కార్యాలయ అధికారులు మాత్రం వాస్తును నమ్ముతుండడంతో ఇదేమి వాస్తు బాబూ అంటూ నవ్వుకుంటున్నారు. మూడేళ్ల క్రితం అప్పటి డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ వాస్తు పేరుతో ప్రధాన ద్వారానికి తాళం వేసి పక్కనే ఉన్న మరో ద్వారం నుంచి రాకపోకలు సాగించారు. కార్యాలయంలో పనులు జరగని వారు నేరుగా తహసీల్దార్, డీటీ వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగేవారని, అందుకే ఇలా వాస్తు పేరిట ప్రధాన ద్వారానికి తాళం వేశారని సమాచారం. దీనిపై తహసీల్దార్ హుసేన్ సాహెబ్‌ను విచారించగా.. వాస్తు బాగాలేదని ముందు నుంచి ఇలాగే తిరుగుతుండడంతో, తాము అలానే కొనసాగిస్తున్నామని చెప్పారు.